క్లుప్తంగా

125 మందికి పరీక్షలు

కాజీపేట: పట్టణంలో రాంకిశోర్ ఉపాధ్యాయ జ్ఞాపకార్థం గణేష్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని దీపక్ మంగళవారం కొల్హారియా ప్రారంభించారు. 125 మందికి రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

రక్తదాన శిబిరం

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్ రాంపూర్ వీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో శిబిరాన్ని నిర్వహించారు. రక్తదానం శిబిరంలో 104 మంది పాల్గొని రక్తదానం చేసినట్లు సిబ్బంది తెలిపారు. కాలేజీ సెక్రటరీ వేముగంటి అపర్ణ మాట్లాడుతూ మా విద్యార్థులు, అధ్యాపకులు సమాజానికి ఉపయోగపడేందుకు ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఆర్‌జీ కిషన్‌రావు, శ్రీనివాస్, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ ప్రాంగణంలో అమృత్ భారత్ స్టేషన్ పథకం (ఏబీఎస్ఎస్)లో వరల్డ్ క్లాస్ స్టేషన్‌గా రీ డెవలప్‌మెంట్ చేయడానికి రైల్వే అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో పలు కార్యాలయాలను నేలమట్టం చేయడం, జంక్షన్ ముందు పలు గార్డెనింగ్‌లను తొలగించారు. కాగా రైల్వే స్టేషన్ ఎదుట మంగళవారం రైల్వే అధికారులు సర్క్యులేటింగ్ ఏరియాలో సిమెంట్ ఇటుకలతో సర్కిల్ అభివృద్ధి పనులను చేపట్టారు.

తేనెతో అభిషేకం

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్రీ శ్వేతార్క మూలగణపతి దివ్య క్షేత్రంలో మంగళవారం బ్రహ్మోత్సవ వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆలయ వ్యవస్థాపకులు ఐనవోలు అనంతమల్లయ్యశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో పండితులు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తెచ్చిన 108 లీటర్ల తేనెతో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణశర్మ భక్తుల గోత్రనామాలతో గణపతి హోమం జరిపించారు. భక్తులకు అన్నపూర్ణ కేంద్రంలో మహాన్నదానం చేశారు. పూజల్లో సాయికృష్ణ శర్మ, ఆలయ మేనేజర్ రవి, పీఆర్వో మణిదీప్, రాజమోహన్, సదానందం పాల్గొన్నారు.

మొలకెత్తిన గింజలతోనే ఆరోగ్యం

ఖిలావరంగల్ : మొలకెత్తిన గింజలు, చిరుధాన్యాలు ,ఆకుకూరలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ విశ్వజ, కార్పొరేటర్ పోశాల పద్మ సూచించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం ఎక్కువ తీసుకోవాలని తెలిపారు. మంగళవారం వరంగల్ 41వ డివిజన్ ఉర్సు హరిజన వాడలో అంగనవాడీ కేంద్రం సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. ఆరోగ్యవంతమైన పిల్లలకు ప్రోత్సాహక సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు.

పెరిగిన చేపల ఉత్పత్తి

హసన్‌పర్తి: రాష్ట్రంలో చేపల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని ఫిషరీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లయ్య అన్నారు. మండలంలోని పెగడపల్లిలోని ఎల్లమ్మ చెరువులో 1.29 లక్షల చేప పిల్లలు, పడమటి చెరువులో 75 వేల చేప పిల్లలను మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కె. కొమురెల్లి, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, డైరెక్టర్లు రవీందర్, సాంబయ్య, శ్రీనివాస్, రాజ్‌కుమార్, సూర్య పాల్గొన్నారు.

కట్టడాలను పరిరక్షించాలి

ఖిలా వరంగల్: కాకతీయుల కట్టడాలు, పురాతన విగ్రహాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, గంట రవికుమార్ అన్నారు. చారిత్రక ప్రసిద్ధి చెందిన మెట్ల బావి ప్రాంగణంలో బయటపడిన శివలింగానికి మంగళవారం వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగం బయట పడిన నేపథ్యంలో స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి వేర్వేరుగా శివలింగాన్ని దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. లింగమూర్తి, శ్యాం సుందర్, రాంబాబు, ఉషారాణి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

హసన్‌పర్తి : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న ఆశ వర్కర్ల శిబిరాన్ని మంగళవారం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగళ్లపల్లి తిరుపతి, మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, సారంగపాణి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

రేపు ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలు

ఖిలా వరంగల్: మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా గురువారం కరీమాబాద్ ఉర్సు దర్గాల్లో హవేలీ ఉర్సు జాగీర్ పీఠాధిపతుల ఆధ్వర్యంలో ఈద్ మిలాద్-ఉన్-నబీ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సయ్యద్ యహియా పాషా ఖాద్రీ తెలిపారు. మంగళవారం వరంగల్ కరీమాబాద్ హవేలీ ఉర్సులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.


మడికొండ : ఐలమ్మ చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్, రజక సంఘం నేతలు


గీసుకొండ: ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొండేటి శ్రీధర్, బీజేపీ నాయకులు


వరంగల్ చౌరస్తా: విగ్రహ నిర్మాణానికి పూజలు చేస్తున్న బీజేపీ నేతలు

ఐలమ్మ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ పోరాట పటిమను నేటి సమాజం స్ఫూర్తిగా తీసుకోవాలని పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ సూచించారు. మంగళవారం ఖిలావరంగల్ మండలంలోని మామునూరు పీటీసీలో పరిపాలన విభాగం అధికారుల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో పలువురు మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన పంటలను దోచుకునేందుకు ప్రయత్నించిన దొరలను, వారి గుండాలను గడీల వరకు తరిమిన ఉగ్రనారి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కొన్ని చోట్ల చాకలి ఐలమ్మ విగ్రహాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రజక సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


ఖిలావరంగల్ : ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీటీసీ అధికారులు


కాజీపేట : ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారావు


కేయూ క్యాంపస్ : ఐలమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్


వరంగల్ : బీసీ హక్కుల సాధన సమితి నేతల నివాళి


హసన్‌పర్తిలో..


హన్మకొండ : నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు

శివనగర్ మట్టి గణేశుడికి మొదటి బహుమతి


మొదటి బహుమతి అందుకుంటున్న దామోదర్


ట్రైసిటీస్‌లో అవార్డును అందుకుంటున్న దృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని వాసవి లేన్‌లో వినాయక ట్రస్ట్ భవన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన మట్టి గణనాథుడికి మంగళవారం మొదటి బహుమతి లభించింది. విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు మంగళవారం వాసవి లేన్‌లోని మట్టి విఘ్నేశ్వరున్ని పరిశీలించి పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరునికి నగరంలోనే మొదటి బహుమతి ప్రకటించి మెమొంటోను అందజేశారు. సాదుల దామోదర్, మంచాల కృష్ణమూర్తి, రవికంటి అశోక్, అంచూరి కిషోర్, విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు పాల్గొన్నారు

వల్లభ గణపతికి ట్రైసిటీస్ అత్యుత్తమ అవార్డు

కాశిబుగ్గ : కాశిబుగ్గ వర్తకసంఘం ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల్లో ప్రతిష్ఠించిన వల్లభ గణపతికి అత్యుత్తమ అవార్డు లభించింది. మంగళవారం హంటర్‌రోడ్‌లోని విష్ణుప్రియ గార్డెన్స్‌లో ట్రైసిటీలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించిన ఉత్సవ మండళ్లకు బహుమతులను విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో అందజేశారు. కాశిబుగ్గ వర్తక సంఘం సభ్యులకు ట్రైసిటీలో అత్యుత్తమ బహుమతిని ప్రదానం చేశారు. విగ్రహ దాత మనోహర్ మాట్లాడుతూ లండన్ మ్యూజియంలో వల్లభ గణపతి విగ్రహం ఉందని ప్రత్యేక అక్కడ నుంచి ఫొటోను తెప్పించి మట్టితో తయారు చేయించామన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

ఖిలా వరంగల్: గత ఏడాది అనారోగ్యంతో తల్లి మృతి చెందగా ఒంటరై మానసిక వేదనకు గురైన ఓ యువకుడు ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి వరంగల్ శివనగర్‌లోని భూపేష్‌నగర్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. 34వ డివిజన్‌కు చెందిన రామ కిషోర్(22) ఇంట్లో ఒంటరిగా ఉంటూ వరంగల్ హెడ్‌పోస్టాఫీసు వద్ద దిష్టిబొమ్మలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఒంటరిగా ఉన్న సమయంలో తల్లిని గుర్తు చేసుకుంటూ బాధపడుతుండే వాడని స్థానికులు చెబుతున్నారు. మంగళవారం ఉదయం వ్యాపారం చేసి ఇంటికి చేరుకున్న కిషోర్ తల్లిని గుర్తు చేసుకుంటూ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం అందజేయగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు.

మండపాల వద్ద పూజలు, అన్నదానాలు

గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా నగరంలోని కాలనీల్లో, ప్రధాన కూడళ్లలో వినాయక మండపాల వద్ద మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పిండి వంటకాలతో నైవేద్యం సమర్పించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. అనంతరం భక్తులు, దాతల, కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాల్లో యూత్ కమిటీ సభ్యులు, పార్టీ ప్రతినిధులు, అధికారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్


కాజీపేట అర్బన్ : కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు


కాజీపేట : 63వ డివిజన్ అంబేద్కర్ నగర్‌లో..


కాశిబుగ్గ : 108 రకాల వంటకాలతో పూజలు


కాజీపేట రూరల్ : బాపూజీనగర్‌లో..


హసన్‌పర్తి: పూజలు నిర్వహిస్తున్న డీసీపీ సంజీవ్


హనుమకొండ : అల్లీపురలో ప్రభుత్వ చీఫ్‌విప్


ఖిలావరంగల్ : పెరుకవాడలో..


వరంగల్ : లేబర్‌కాలనీలో ఏకరూప దుస్తులతో..


కోర్టు ఎదుట ఏర్పాటు చేసిన మండపం వద్ద..


మడికొండ : మడికొండ చౌరస్తాలో..

అమ్మవారిని దర్శించుకున్న యోగి శ్రీసంత్

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయాన్ని మంగళవారం ఉత్తరాఖండ్ రుద్రప్రయాగకు చెందిన యోగి శ్రీసంత్ సదానందగిరి మహారాజ్, కళాజ్యోతి రాఖాడితో కలిసి సందర్శించారు. ఆలయ ఈఓ శేషుభారతి, అర్చకులు భద్రకాళి శేషు వారిని ఘనంగా స్వాగతించారు. యోగి మహారాజ్ ముందుగా గోశాలను, ఆదిశంకరులను, వల్లభగణపతిని దర్శించిన అనంతరం అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ స్నపన మండపంలో భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. శేషుభారతి యోగికి పండ్లు, శేషవస్త్రాలు అందజేశారు.


యోగి మహారాజ్, రాఖాడిలను స్వాగతిస్తున్న ఈఓ శేషుభారతి, అర్చకులు

తల్లిని బిడ్డ చెంతకు చేర్చిన సఖీ

కాజీపేట అర్బన్ : దారితప్పిపోయి నగరంలో ఒంటరిగా తిరుగుతున్న వృద్ధ తల్లిని బిడ్డ చెంతకు సఖీ వన్‌స్టాప్ సెంటర్ నిర్వాహకులు మంగళవారం చేర్చారు. సఖీ వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ హైమావతి కథనం ప్రకారం.. ఈనెల 24న సఖి వన్‌స్టాప్ సెంటర్ టోల్‌ఫ్రీ నెంబర్ 181కు కేయూసీ రోడ్డు వద్ద ఒక వృద్ధురాలు ఒంటరిగా తిరుగుతుందని స్థానికులు ఫోన్ చేశారు. సమాచారం మేరకు వృద్ధురాలి వద్దకు చేరుకుని సఖీ వన్‌స్టాప్ సెంటర్ వాహనంలో హన్మకొండ పీఎస్‌కు తీసుకుని వెళ్లి పోలీసుల సహకారంతో వృద్ధురాలి కొడుకులు, కూతుర్ల వివరాలను తెలుసుకున్నాం. వృద్ధురాలిని సఖీ సెంటర్‌కు తీసుకుకొచ్చి తాత్కాలిక వసతి, దుస్తులను అందజేసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాం. తమది జగిత్యాల జిల్లా అని ఇటీవల భద్రాచలం వెళ్లివస్తానని ఇంట్లో నుంచి వెళ్లి భద్రాచలం రాలేదని, అప్పటి నుంచి తమ తల్లి ఆచూకీ కోసం వెతుకుతున్నట్లు కూతురు తెలిపింది. వృద్ధురాలు రాజమ్మను చిన్న కూతురుకు అప్పగించాం. రాజమ్మ కుటుంబసభ్యులు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్


కరీమాబాద్ : పంట నష్టపరిహారం చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేశ్

కరీమాబాద్: రాష్ట్రంలో రైతు సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్ అన్నారు. వరంగల్ నాయుడుపెట్రోల్ పంపు సమీపంలోని వినయ్ గార్డెన్‌లో మంగళవారం నియోజకవర్గ పరిధిలోని ఖిలా వరంగల్ మండలానికి చెందిన 362 మంది రైతులకు పంట నష్ట పరిహారం రూ.2 కోట్ల 65 లక్షల చెక్కులను అందజేశారు. గ్రేటర్ పరిధిలోని 43, 44వ డివిజన్లకు సంబంధించిన 24 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈదురు అరుణ, విక్టర్‌లతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కుల సంఘాల మద్దతు

హసన్‌పర్తి: వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు గ్రామంలోని ఆయా కుల సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానాలు చేసి, ఎమ్మెల్యేకు మద్దతు ప్రకటించాయి. మండలంలోని దేవన్నపేటలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది దేవన్నపేటలోని నాలుగు కుల సంఘాల కమ్యూనిటీ హాల్‌ల నిర్మాణాలకు రూ.10లక్షల చొప్పున ప్రొసీడింగ్‌లు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుగులోతు దివ్యారాణి, ఆత్మ డైరెక్టర్ పంజాల భూపాల్, మాజీ సర్పంచ్ రవి, పీఏసీఎస్ డైరెక్టర్ విజేందర్, వాసుదేవారెడ్డి, మాజీ కార్పొరేటర్ రాజునాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధికి పెద్దపీట

తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే రమేశ్ అన్నారు. 55వ డివిజన్ భీమారంలోని గౌడ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.10 లక్షల ప్రొసీడింగ్‌ను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రజిత, మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, డివిజన్ అధ్యక్షుడు రవీందర్, యూత్ అధ్యక్షుడు సాయి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన



కాజీపేట అర్బన్ : పర్యావరణ పరిరక్షణకు మేము సైతం అంటూ కడిపికొండ రాజీవ్ గృహకల్ప సముదాయంలోని సెయింట్ మేరిస్ పాఠశాల విద్యార్థులు మట్టి గణపతిని పూజిస్తాం పీఓపీని తరిమికొడదాం అంటూ ప్లకార్డులను చేబూని నాటికతో ఆకట్టుకున్నారు. మంగళవారం విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో పీఓపీ విగ్రహాల నిమజ్జనంతో కలిగే వాతావరణ కాలుష్యంపై, మట్టి వినాయకుడితో కలిగే లాభాలపై నాటక రూపంలో ప్రదర్శించారు.

రాకపోకలు పునరుద్ధరణ

హన్మకొండ: హనుమకొండలోని వంద ఫీట్ల రోడ్డుపై రాకపోకలు పునరుద్ధరించబడ్డాయి. రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో మంగళవారం నుంచి వాహనాలు పరుగులు పెడుతున్నాయి. రోడ్డు అడుగుభాగంలో డక్ట్ అండ్ డ్రైన్ నిర్మాణం చేపట్టడంతో ఏడాదిన్నర కాలంగా ఈ మార్గాన్ని మూసి వేశారు. రోడ్డు భాగంలోనే దిగువన డక్ట్ అండ్ డ్రైన్, పైనా రోడ్డు మార్గం కల్పించేలా ప్రణాళిక రూపొందించి నిర్మాణం పూర్తి చేశారు.

బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా విద్యాసాగర్‌రెడ్డి

వరంగల్ లీగల్ : బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా సి.విద్యాసాగర్‌రెడ్డి నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యాలయ వర్గాలు నియామక పత్రం అందజేశారు. పరకాల మండలానికి చెందిన విద్యాసాగర్ 30 ఏళ్లుగా న్యాయవాదిగా పనిచేస్తున్నారు. గతంలో ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు.

రాహుల్‌ను విమర్శించే స్థాయి నీకు లేదు

మడికొండ: రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి నీకు లేదు ఖబడ్దార్ అసదుద్దీన్ ఓవైసీ అని ఏఐసీసీ సభ్యుడు, ఉమ్మడి రాష్ట్ర వికలాంగుల శాఖ చైర్మన్ బక్క జడ్సన్ హెచ్చరించారు. మంగళవారం మడికొండలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టే బీజేపీ నాయకులు మోదీ, అమిత్ షా, యోగిలను నీపై పోటీ చేయమని సవాల్ చేసి చిత్తశుద్ధి చాటుకోవాలని సవాల్ చేశారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

కేయూ క్యాంపస్ : రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోని ఆర్ట్స్ అండ్‌సైన్స్ కళాశాలలోని కాంట్రాక్టు లెక్చరర్లు మంగళవారం ఆ కళాశాల ఆవరణలో దీక్షలు కొనసాగించారు. ఈ దీక్షలను కళాశాల కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అంజన్‌రావు ప్రారంభించి మాట్లాడారు. కరుణాకర్‌రావు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు.

కరపత్రం ఆవిష్కరణ

కాజీపేట రూరల్ : బాపూజీనగర్ పోచమ్మ గుడి ప్రాంగణంలో మంగళవారం బాపూజీనగర్ తేజోమయిమాల కుల సంక్షేమ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మర్యాల కృష్ణ, బండి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బుద్ధభవన్ నిర్మాణ భూమి పూజ కార్యక్రమం విజయవంతం చేయాలని కరపత్రాన్ని ఆవిష్కరించారు. స్థానిక కార్పొరేటర్ సంకు నర్సింగరావు మాట్లాడుతూ హన్మకొండలో ఆదివారం జరిగే నూతన బుద్ధ భవన్ నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు.

విజేత స్కూల్‌లో ఫ్లవర్స్ డే

కాజీపేట రూరల్ : కాజీపేట డీజిల్‌కాలనీ (బాపూజీనగర్) విజేత హైస్కూల్‌లో మంగళవారం ఘనంగా ఫ్లవర్స్ డే ఘనంగా నిర్వహించారు. హెడ్‌మాస్టర్ బండి కల్పన, డైరెక్టర్ బండి ప్రదీప్ మాట్లాడుతూ పువ్వులు ప్రకృతి సృష్టి అని పూల ప్రాముఖ్యతను వారు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పండ్లు, కూరగాయలపై అవగాహన

హన్మకొండ: హనుమకొండ మాదిరెడ్డికుంటలోని ప్రోగ్రెస్ హైస్కూల్‌లో మంగళవారం పండ్లు, కూరగాయలపై నర్సరీ, ఎల్‌కేజీ, యుకేజీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్నారులు ఇంటి నుంచి తీసుకొచ్చిన ఒక్కో పండు, ఒక్కో కూరగాయల గురించి స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు చక్కగా వివరించారు. కార్యక్రమంలో క్లాస్ టీచర్ కవిత పాల్గొన్నారు

29న రిలీఫ్ ఆస్పత్రిలో గుండె వైద్యశిబిరం


మాట్లాడుతున్న డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి

హసన్‌పర్తి: ఈనెల 29న ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని 2వ డివిజన్ ఆరెపల్లి సమీపంలోని రిలీఫ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు సీనియర్ వైద్యుడు డాక్టర్ వెంకట అనిల్ కుమార్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ ఆడిటోరియంలో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 29న ములుగురోడ్ నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు 3కే భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. సుమారు వేయి మంది వైద్య విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొంటారన్నారు. శిబిరంలో ఉచిత ఈసీజీ, 2డితోపాటు ఇతర గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, సీపీ రంగనాథ్, మేయర్ గుండు సుధారాణి, వర్ధన్న పేట ఎమ్మెల్యే రమేశ్ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రకటన

[illegible]

Sd/- CH. AGA REDDY, B.Sc. LL.B.
Advocate Notary



సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
కె. సుధాకర్ (ACO) : 9177258410 (హన్మకొండ)
పి. చంద్రశేఖర్ (ACO) : 8074606274 (వరంగల్)
జి. రవియాదవ్ (ACO) : 9032782191 (కాజీపేట)